సాక్షి కుమురం భీం

మంగళవారం : 18 : జూన్ : 2024



అప్రమత్తతే జీవాలకు రక్ష

వర్షాకాలంలో పశువులు, జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువ. పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 8లో▸



హరితహారానికి మొక్కలు సిద్ధం

హరితహారం కార్యక్రమం కోసం తిర్యాణి మండలంలో 29 నర్సరీలు ఏర్పాటు చేశారు. అధికారులు 3.01 లక్షల మొక్కలు సిద్ధం చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.5 /27.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



కేసీఆర్‌తో జోగు రామన్న, ఆత్రం సక్కు

ఆదిలాబాద్‌టౌన్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను మాజీ మంత్రి జోగు రామన్న, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసంలో ఆయన్ను కలిసిన నాయకులు ఉమ్మడి జిల్లా రాజకీయ స్థితిగతులు, ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన పార్టీ ఓటమిపై చర్చించారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. ప్రైవేట్ బ్యాంకుల్లో రిలేషన్‌షిప్ మేనేజర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు, తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు. కెమిస్ట్రీతో డిగ్రీ పూర్తి చేసిన బీఎస్సీ అభ్యర్థుల కోసం శ్రీకృష్ణా ఫార్మా కంపెనీ ఈ నెల 20న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన పురుష అభ్యర్థులు ఈ నెల 19లోగా 70136 07011 నంబర్‌కు వివరాలు వాట్సాప్ ద్వారా పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గం



ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం పట్టణంలో ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ సుద్దాల దేవన్న, వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, సభ్యులతో మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు సభ్యులను శాలువాతో సన్మానించారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ వేర్వేరుగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఉమా మహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

21న కాగజ్‌నగర్‌లో 'యోగాభ్యసన'

కాగజ్‌నగర్‌రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న పట్టణంలోని పటేల్‌గార్డెన్‌లో యోగాభ్యసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పతంజలి యోగా సమితి జిల్లా ప్రచార సమితి శిక్షకులు దాసరి వినోద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగాభ్యసన కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. వాటర్ బాటిల్, యోగా మ్యాట్ వెంట తెచ్చుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

లింగాపూర్(ఆసిఫాబాద్): లింగాపూర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం మధ్యాహ్నం ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తనిఖీ చేశారు. రిజిస్టర్లు తనిఖీ చేసి స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడారు. సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. బాధితుల కేసులను చట్టపరంగా పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట జైనూర్ సీఐ అంజయ్య ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న రావి శ్రీనివాస్



కాగజ్‌నగర్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు

ఘనంగా బక్రీద్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌రూరల్: జిల్లావ్యాప్తంగా సోమవారం ముస్లింలు బక్రీద్ ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్‌లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాగజ్‌నగర్ పట్టణంలో జామా మసీదు ఇమామ్ మౌలానా ఇంతేఖాబ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థన స్థలాల వద్ద కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



కెరమెరి: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద..

పల్లెల్లో భూవివాదాలు

చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామం శివారులోని భూమి కోసం జరిగిన గొడవలో ఆరుగురిపై కేసు నమోదైంది. మహిళకు సంబంధించిన భూమిలో ఆమె కుటుంబ సభ్యులే గొడవకు దిగారు. పంపకాల్లో అవగాహనకు రాకపోవడంతో గొడవ పోలీసు కేసుగా మారింది.

బెజ్జూర్ మండలం అంబగట్ట శివారులోని భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా బూరుగూడ గ్రామానికి చెందిన కొందరు భూమి తమదిగా చెబుతూ స్థలంలోకి వచ్చారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసుకోవడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఇలా.. భూమి కోసం కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పట్టింపులు, పంతాలకు పోయి తగాదాలుగా మారుతున్నాయి. పంపకాలు, కేటాయింపుల గొడవలు ప్రాణాలు తీస్తున్నాయి. ఇటీవల పెరుగుతున్న భూతగాదాలకు ఆదివారం జరిగిన ఈ రెండు గొడవలు నిదర్శనం.



- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- సొంత కుటుంబ సభ్యులు, బంధువుల మధ్యే కక్షలు
- మ్యాపింగ్ లేకపోవడం, హద్దులు తేలక తరచూ గొడవలు
- పరిష్కారం చూపని ధరణి పోర్టల్

చింతలమానెపల్లి: జిల్లావ్యాప్తంగా భూతగాదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. గ్రామస్తులు, కుటుంబసభ్యులు అనే తేడా లేకుండా మాటలతో మొదలై ఘర్షణకు దారి తీస్తున్నాయి. కర్రలు, గొడ్డళ్లతో దాడి చేసుకుని కేసుల నమోదు వరకూ వెళ్తున్నాయి. గతంలో జిల్లాలో భూమి కోసం ప్రాణాలు తీసి పాశవికంగా హత్యలు చేసిన ఘటనలు సైతం ఉన్నాయి.

విలువ పెరగడంతోనే కక్షలు..

జిల్లాలో సుమారు 4.60 లక్షలకు పైగా ఎకరాల్లో సాగు భూమి ఉంది. పోడు భూముల విస్తీర్ణం కలిపితే ఇంకా ఎక్కువే.. మారుతున్న సమాజ, ఆర్థిక పరిస్థితులు, పట్టణీకరణ కారణంగా భూముల విలువ మారుతోంది. సరిగ్గా చెప్పాలంటే పదేళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం భూముల ధరలు ఊహించనంతగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో ధరలు వందశాతం పెరగడం గమనార్హం. రవాణా వ్యవస్థ, అవసరాలు, పారిశ్రామికీకరణ, వాణిజ్య వ్యాపారాలు భూముల ధరలు పెరగడంలో కీలకంగా మారుతున్నాయి. గతంలో రూ.వేలల్లో ధరల పలికిన భూములు నేడు గుంటకు రూ.లక్షల వరకు చేరడంతోనే భూతగాదాలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

చట్టాలపై అవగాహన లేక..

ఆస్తి హక్కు చట్టం ప్రకారం తండ్రి సంపాదించిన ఆస్తిలో కుమారులతోపాటు కుమార్తెలకు సమాన హక్కులు ఉంటాయి. ఈ విషయంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వారసత్వంగా వచ్చే భూముల పంపకంలో గొడవలు సాధారణంగా మారాయి. భూపంపకాలను చట్టప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా పంపిణీ చేపట్టిన చోట తగాదాలకు ఆస్కారం ఉంటోంది. భూతగాదాలకు రెవెన్యూ చట్టాలు సైతం పరోక్ష కారణంగా నిలుస్తున్నాయి. భూముల వివరాల నమోదు, పట్టాల తీరు అనేక రకాలు ఉన్నాయి. బందోబస్తు, అసైన్డ్, ఖారిజ్, పడావు.. ఇలా పలు రకాలుగా రెవెన్యూ రికార్డులో భూముల వివరాలు నమోదు చేస్తారు. కాగా అసైన్డ్ చట్టం ప్రకారం వివరాలు నమోదు చేసిన భూములకు కచ్చితమైన కొలతలు ఉండవు. వీటిని కొనుగోలు చేయడానికి వీలు లేదు. కేవలం ఈ భూములు వారసత్వంగా మాత్రమే కుటుంబాలు, వారసులకు సంక్రమిస్తాయి. ఈ భూములను లాభాపేక్షతో లేదా తక్కువ ధరలకు కొనుగోలు చేస్తే ఇబ్బందులు పడాల్సిందే. మరోవైపు ఎలాంటి ప్రభుత్వ నక్ష(మ్యాపింగ్) ఈ భూములకు ఉండదు. గొడవల్లో ఎక్కువగా ఈ భూములు ఉండడానికి కారణం నక్ష లేకపోవడమే. హద్దులు లేక పోవడంతో కబ్జాలో ఉన్నవారిదే భూమిగా ప్రభుత్వ అధికారులు సైతం ధృవీకరించే పరిస్థితి. దీంతో పాటు పంపకాలు, హద్దుల విషయం కూడా గొడవలకు కారణమవుతోంది. ఫిర్యాదు చేసినా అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితులు ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయాలలో అధికారుల చేతివాటం అక్రమ నమోదులు సైతం వివాదాలకు అవకాశాలుగా మారుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం భూముల కోసం ఆన్‌లైన్ విధానంలో ప్రవేశపెట్టిన ధరణి సైతం సరైన పరిష్కారం ఇవ్వలేకపోవడంతో విమర్శల పాలైంది. జిల్లాకు సంబంధించి ధరణి పోర్టల్‌లో 3,417 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

గతంలో జరిగిన ఘటనలు

- కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో కుటుంబాల మధ్య భూపంపకాలు చిచ్చుపెట్టాయి. భూమి కోసం జరిగిన వివాదంలో ఇద్దరు మహిళలను అదే కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి దారుణంగా హత్య చేశాడు.
- చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామంలో భూముల కోసం జరిగిన గొడవలో ఎనిమిది మందికి గాయాలు కాగా.. అప్పటి ఉప సర్పంచ్ సహా కొందరిపై కేసు నమోదైంది.
- రెబ్బెన మండలం జక్కులపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో దాయాదుల మధ్య జరిగిన భూ తగాదాలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ సమీపంలో జరిగిన ఒక భూవివాదంలో కాగజ్‌నగర్‌కు చెందిన ఒక వ్యాపారిని దారుణంగా హత్య చేశారు.
- వాంకిడి మండలంలోని ఖమాన గ్రామం శివారులో భూ తగాదా నేపథ్యంలో సొంత తమ్ముడు, తమ్ముడి భార్యను గొడ్డళ్లతో నరికి హత్య చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



ప్రతిఒక్కరికీ భూమి, ఆస్తి హక్కులు, చట్టాలు, శాంతిభద్రతలపై అవగాహన ఉండాలి. వాణిజ్యపరమైన అవసరాలకు భూమిని వినియోగించాలంటే ప్రభుత్వం భూముల పంపకాలు చట్టబద్ధంగా నిర్వహించుకుంటే గొడవలకు అవకాశం ఉండదు. భూముల పంపకాలలో ఉండే హక్కులను చట్టాలలో పొందుపరిచారు. అవగాహన లేని వారు న్యాయ సలహాలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవు. చట్టప్రకారం భూములను పంపకాలు చేసుకునే వారిపై ఎలాంటి వివాదాలు కలిగించినా శాంతిభద్రతల రక్షణలో భాగంగా శిక్షార్హులు అవుతారు.

– గుండారపు గణపతి, న్యాయవాది, కాగజ్‌నగర్

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చింతలమానెపల్లి(సిర్పూర్): రాష్ట్రవాప్తంగా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దహెగాం మండలానికి చెందిన చిన్నారిని పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని అన్నారు. గంజాయి మత్తులో నిందితుడు దారుణానికి పాల్పడ్డాడని, ఇది విచ్చలవిడిగా గంజాయి లభ్యమవుతుందనే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు ఉపాధి లేక పట్టణాలకు వలస వెళ్తున్నారని, వ్యవసాయం లాభసాటిగా లేక ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రికలో 'కన్నీటి వలస' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సుల్తానాబాద్ ఘటనలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితుడిని ఉరిశిక్ష విధించాలని, కుటుంబానికి రూ.20లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షులు డా.శిల్పారెడ్డి, సిర్పూర్ జెడ్పీటీసీ నీరటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



'కన్నీటి వలస' కథనాన్ని చూపుతున్న ఎమ్మెల్యే

ఎస్పీ సురేశ్‌కుమార్ బదిలీ



జైనూర్‌లో ఆదివాసీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్(ఫైల్)

- జిల్లాలో మూడున్నర ఏళ్లపాటు విధులు
- శాంతిభద్రతల మధ్య అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ
- నూతన ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు



నూతన ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: జిల్లా ఎస్పీ కె.సురేశ్‌కుమార్ బదిలీ అయ్యారు. రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ సురేశ్‌కుమార్ హైదరాబాద్‌లోని బాలానగర్ డీసీపీగా బదిలీ అయ్యారు. సైబరాబాద్ డీసీపీగా పని చేస్తున్న డీవీ శ్రీనివాసరావు జిల్లాకు నూతన ఎస్పీగా రానున్నారు. 2021 డిసెంబర్ 21న ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సురేశ్‌కుమార్ జిల్లాలో మూడున్నర సంవత్సరాలపాటు విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు కల్పించారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా జైనూర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణను శాంతియుతంగా పరిష్కరించారు. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఆదివాసీ గూడాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం, సోలార్ లైట్లు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టారు. దివ్యాంగులకు జైపూర్ కృత్రిమ కాళ్లు అందించి భరోసా కల్పించారు. పోలీసుల ఆధ్వర్యంలో తిర్యాణి మండలం గుండాల గ్రామానికి ఏడు కిలోమీటర్ల రహదారి నిర్మించి గిరిజనులకు అండగా నిలిచారు.

'నకిలీ'తో దిగుబడికి చేటు

- నాణ్యమైన విత్తనంతోనే లాభాలు
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి
- నోటిఫైడ్ విత్తనాలతో దిగుబడి తగ్గితే రైతులకు పరిహారం
- జిల్లాలో 4.60 ఎకరాల్లో వానాకాలం సాగు



కెరమెరిలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

కెరమెరి(ఆసిఫాబాద్): వానాకాలం సీజన్ ప్రారంభమైంది. మోస్తరు వర్షాలకు కూడా రైతులు విత్తనాలు విత్తుకుంటున్నారు. కానీ అధిక దిగుబడులు రావాలంటే విత్తన ఎంపిక ఎంతో కీలకం. మార్కెట్‌లో విచ్చలవిడిగా లూజు విత్తనాలు, నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్న నేపథ్యంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. తాజాగా దహెగాం మండలంలోనూ 1.24 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు.

వివిధ కంపెనీల పేర్లతో విత్తనాలు

జిల్లాలో దాదాపు 1.21 మంది రైతులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తోంది. జిల్లాలో అత్యధికంగా సాగు చేసే పత్తి విత్తనాలు విత్తే పనులు ఇప్పటికే జోరందుకున్నాయి. వరి సుమారు 59 వేల ఎకరాలు, కంది 38 వేల ఎకరాల్లో సాగు ఉండనుంది. ఇలాంటి సమయంలో రైతులు మేలు రకమైన విత్తనాలు ఎంచుకుంటే మెరుగైన దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది. గతంలో రైతులు సొంతంగా విత్తనాలు సేకరించుకునేవారు. అయితే గడిచిన ఐదారేళ్ల కాలంలో పత్తి, కంది, మినుములు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలకు సంబంధించి వివిధ విత్తన కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించాయి. పోటీ పెరగడంతో డీలర్ల ఏర్పాటు చేసుకుని ఆఫర్ల పేరుతో ప్రచారం చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే నకిలీల బెడద పెరిగిపోయింది. ప్రభుత్వ అనుమతి లేకున్నా కంపెనీ పేర్లతో విక్రయాలు జరగడంతో రైతులు నష్టపోతున్నారు.

నోటిఫైడ్.. నాన్‌నోటిఫైడ్

ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు ఏటా నోటిఫైడ్(ప్రకటిత) పేరుతో విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. ఇవి విత్తన చట్టాలు 1966, 1983 పరిధిలోకి వస్తాయి. సంబంధిత విత్తనాలు నాణ్యత ప్రమాణాలు పాటించడంలో విఫలమైతే ఉత్పత్తి దారుడు, పంపిణీదారులు చట్టరీత్యా శిక్షార్హులు అవుతారు. నాన్ నోటిఫైడ్ విత్తనాలకు ఇవేవీ వర్తించవు. మరోవైపు అధికారులు, పోలీసులు తనిఖీలు చేపడుతున్నా కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. అధిక దిగుబడి వస్తుంది.. కలుపు సమస్య ఉండదంటూ నమ్మించి అంటగడుతున్నారు. కౌటాల, దహెగాం, బెజ్జూర్, కెరమెరి, తిర్యాణి, జైనూర్, కాగజ్‌నగర్ మండలాల్లో ఈ నకిలీ విత్తనాల విక్రయాలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులు లైసెన్స్‌డ్ దుకాణాల్లో నోటిఫైడ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రైవేట్ కంపెనీల ప్రచారం నమ్మి మోసపోవద్దు. విత్తన దుకాణాల్లో కొనుగోలు ముందు సంబంధిత కంపెనీకి అనుమతి ఉందా.. లేదా.. అనే విషయాలపై ఆరా తీయాలి. బిల్లులు తప్పనిసరిగా తీసుకుని, విత్తన సంచులు కూడా భద్రపర్చుకోవడం కూడా ముఖ్యం.

లైసెన్స్‌డ్ విత్తనాలే మేలు

విత్తనాల కొనుగోలు సమయంలో సంబంధిత క్లస్టర్ ఏఈవోలను రైతులు సంప్రదించి సలహాలు తీసుకోవాలి. ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడి వస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీల జోలికి వెళ్లొద్దు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

జన్నారం: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ వివరాల మేరకు కృష్ణా జిల్లా నందివాడ మండలం పొనుకుమాడుకు చెందిన వెన్నెల గోపి(35) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఎనిమిదేళ్లక్రితం జన్నారం వలసవచ్చాడు. వెల్డింగ్‌షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నినెలలుగా గిరాకి లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని పలుమార్లు భార్యకు చెప్పుకుని బాధపడేవాడు. వేసవి సెలవుల కారణంగా భార్యా, పిల్లలు స్వగ్రామానికి వెళ్లారు. ఈ నెల 15న ఇంట్లో పురుగుల మందు తాగి నిర్మల్ ఉంటున్న తన అన్న నరేశ్‌కు సమాచారం ఇచ్చాడు. నరేశ్ వచ్చి ముందుగా నిర్మల్‌కు అక్కడి నుంచి ఏపీలోని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

లింగాపూర్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై తులసీరాం తెలిపిన వివరాల మేరకు మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రవి (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఇంట్లో గొడవ చేస్తుండడంతో శనివారం అతని భార్య జైనూర్‌లోని సోదరుని ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రవి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య శాంతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థిని మృతి



వరలక్ష్మి మృతదేహం

కౌటాల: సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీకి చెందిన విద్యార్థిని ఎల్ములే వరలక్ష్మి (12) సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక సిర్పూర్(టి) బాలికల కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం ఇంటి వద్ద కూలర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థిని మృతికి కేజీబీవీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

రిమాండ్ మహిళా ఖైదీ హైడ్రామా

ఆదిలాబాద్‌టౌన్: సుపారి ఇచ్చి ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తన భర్త జాదవ్ గజానంద్‌ను భార్యనే హత్య చేయించిన సంఘటన ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న మృతుని భార్య విజయలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విజయలక్ష్మి బ్లేడ్ ముక్కలు మింగినట్లుగా జైలు అధికారులతో ఆదివారం సాయంత్రం తెలిపింది. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నట్లుగా పేర్కొనడంతో జైలు అధికారులు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాంటి బ్లేడు ముక్కలు లేవని నిర్ధారించారు. ఈ విషయమై జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్‌ను సంప్రదించగా ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో తిరిగి జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

అప్రమత్తతే జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు
- వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే మొదటికే ప్రమాదం



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

బెల్లంపల్లిరూరల్/నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం... వ్యాధులు ప్రబలేకాలం... ముఖ్యంగా జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడేకాలం ఇది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వ్యాధులకు గురికాకముందే పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం. వర్షాకాలం ప్రారంభంలో మూగజీవాలు గొంతువాపు, జబ్బవాపు, చిటికె రోగం, గాలికుంటు లాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మూగజీవాలకు వచ్చే వ్యాధులు, నివారణ పద్ధతులపై పెంపకం దారులకు పశుసంవర్ధకశాఖ అధికారుల సలహాలు, సూచనలు..

జబ్బవాపు :

జబ్బవాపు వ్యాధిని బ్లాక్ క్వార్టర్, బ్లాక్ లెగ్ అని కూడా అంటారు. ఇది తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా సంక్రమిస్తుంది. క్లాస్ట్రిడియం చౌవోయి బ్యాక్టీరియా వలన వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు...

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా, గాయాల వలన ఈ వ్యాధి పశువులకు సోకుతుంది. తీవ్రమైన జ్వరం ఉండి ఆహారం తీసుకోకపోవడం, కుంటడం, ఆకస్మికంగా భుజం, తొడ భాగాల్లో వాపు కనిపిస్తుంది. కండరాల ప్రాంతంలో బ్యాక్టీరియా విష పదార్థాన్ని విడుదల చేయడం ద్వారా ఆ ప్రాంతంలో చర్మం కుళ్లిపోతుంది. కొన్ని దూడల్లో ఈ లక్షణాలు కనిపించకుండానే కిందపడి కొట్టుకుని కొన్ని గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతాయి.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులకు పెనిఫల్లిన్స్ ఎఫ్‌పీపీ 40ఎంఎల్ ఐవీ, చిన్న దూడలకు 20ఎంఎల్ ఐవీ ఇవ్వాలి. ఆంటీఇన్‌ఫ్లమటరీ, ఎన్ఎస్ఏఐడీఎస్, బీకాంప్లెక్స్ ఇంజక్షన్ వేయాలి.

గొంతువాపు :

దీనినే పాశ్చురెల్లోసిస్ అని కూడా అంటారు. ఇది ముఖ్యంగా పశువుల్లో, ప్రధానంగా గేదెల్లో వ్యాపిస్తుంది. పాశ్చురెల్లా మల్టోసిడా బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి సోకుతుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా పశువుల గ్రసనిలో ఉంటుంది. వాతావరణం బ్యాక్టీరియాకు అనుకూలంగా మారినప్పుడు ఇది ఎక్కువగా వృద్ధి చెంది వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

వ్యాధి సోకిన పశువు చొంగతో తాగునీరు, గడ్డి కలుషితమై ఇతర పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, చొంగకారడం, గొంతు, మెడ, ముందరి కాళ్ల మధ్యలో నీరు చేరడం, కంటి నుండి నీరు కావడం, ఊపిరితిత్తులకు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులకు సల్ఫాడిమిడిన్ య్యాంటీ బయోటిక్ 150 మిల్లీ గ్రాములను ఇంజక్షన్ రూపంలో డైల్యూట్ చేసి అందించాలి. ఆంటీ ఇన్‌ఫ్లమటరీ నాన్ స్టిరాయిడ్, ఆంటీ ఇన్‌ఫ్లమటరీ డ్రగ్స్ ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డెక్సన వంటి స్టిరాయిడ్స్ అందించాలి. సీజన్‌కు ముందే వ్యాక్సినేషన్ వేయించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చు.

చిటికె రోగం :

దీనినే పల్ప్ కిడ్నీ డిసిస్ అంటారు. అధికంగా ఆహారం తినడం వలన ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రిడియం పర్‌ఫ్రంజెన్స్ బ్యాక్టీరియా టైప్ సీ, డీ అనే స్ట్రైయిన్స్ వలన గొర్రెలు, మేకలకు వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

మట్టి కలిసిన గడ్డిని తినడం, వర్షాలు కురిసిన సమయంలో అధిక మోతాదులో గడ్డిని మేయడంతో నట్టలు ఎక్కువగా తయారవుతాయి. దీంతో బ్యాక్టీరియా అధికంగా వృద్ధి చెంది ఎప్సిలాన్ ట్యాక్సిన్‌ని పొట్టలో విడుదల చేయడంతో విరేచనాలు అవుతాయి. ఇవి ట్యాక్సిన్ బ్రెయిన్‌కు చేరి ఫిట్స్ వస్తుంది. బ్రెయిన్‌కి చేరిన సమయంలో పశువులు గాలిలో ఎగిరి చిటికె వేసే సమయంలో చనిపోతాయి. టైప్–డీ కిడ్నీలో చేరడంతో కిడ్నీలు గుజ్జువలే తయారవుతాయి. వ్యాధి సోకిన జీవాల్లో విరేచనాలు, కడుపుబ్బరం, వణుకు, పళ్లు కొరకడం, జ్వరం, ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకోవడం చేస్తాయి.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన జీవాలకు ఆంపిసిల్లిన్, క్లోరాంఫినికాల్ మందులు వేయాలి. రిహైడ్రోషన్ సొల్యూషన్, సపోర్టివ్ థెరపీ అందించాలి. ముందస్తు టీకాలు వేయించాలి.

గాలి కుంటు వ్యాధి:

ఈ వ్యాధిని ఫుట్, మౌత్ డిసీస్ అంటారు. ఆవులు, గేదెలు, తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. పికోర్ని ఫ్యామిలీకి చెందిన ఆఫ్థస్ వైరస్ వలన ఈ వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, కాలి పుండ్లు, నోట్లో, చిగుర్లలో బొబ్బలు, పాలిచ్చే వాటిలో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన చిన్న దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స, నివారణ చర్యలు

ఈ వ్యాధి వైరల్ వ్యాధి కావడంతో పూర్తి స్థాయిలో చికిత్స ఉండదు. సెకండరీ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఆంటీబయోటిక్స్ పెనిసిల్లిన్స్ వాడాలి. నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పేస్ట్ రాయాలి. కాలి పుండ్లకు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంగా కడిగి ఆంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ రాయాలి. ఎన్ఎస్ఏఐడీఎస్, ఆంటీ ఇన్‌ఫ్లెమటరీ డ్రగ్స్, లివర్‌టానిక్స్, మల్టీవిటమిన్ టానిక్స్ కచ్చితంగా వాడాలి. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించాలి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం



మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి. జీవాలు వ్యాధుల బారిన పడక ముందే ముందస్తు టీకాలు వేయించడంతో పాటు పశు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– మాను సుజాత, పశువైద్యాధికారి, ఆకెనపల్లి, బెల్లంపల్లి మండలం

నిజాయతీ చాటుకున్న కండక్టర్



సొమ్ము అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకొన్న మంగళసూత్రాన్ని బాధితురాలికి అప్పగించి కండక్టర్ ఆశన్న తన నిజాయతీని చాటుకున్నాడు. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుండి ఆసిఫాబాద్‌కు వస్తుండగా మంచిర్యాల జిల్లా కళ్యాణిఖనికి చెందిన సాంబమూర్తి, లక్ష్మి దంపతులు మందమర్రి స్టేజీ వద్ద ఎక్కి బురుగ్గూడ స్టేజీ వద్ద దిగారు. కండక్టర్ ఆశన్నకు బస్సులో మంగళసూత్రం దొరకడంతో డిపోలోని ఎర్నింగ్ సెక్షన్‌లో డీసీఈకి అప్పగించారు. బాధితులు డిపో అధికారులను సంప్రదించగా సోమవారం అప్పగించారు. కండక్టర్ నిజాయతీని డిపో మేనేజర్ విశ్వనాథ్, అధికారులు అభినందించారు.

28 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, జిల్లా కమిటీ సభ్యుడు జీ.అశోక్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల్లో రాజకీయ చైతన్యం నింపడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు రమణ, దేవదాసు, తిరుపతి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింహారావు



కార్మికులతో మాట్లాడుతున్న నరసింహారావు

శ్రీరాంపూర్: సింగరేణికి కొత్త గనులను కేటాయించాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిలో కార్మికులను కలిసి మాట్లాడారు. కోయగూడెం ఓసీపీ 3 బ్లాక్, సత్తుపల్లిలో ఓసీపీ 3 బ్లాకును అరబిందో ఫార్మా కంపెనీకి ఇవ్వడం సరికాదన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా ఆ కంపెనీకి నుంచి బీజేపీకి కోట్లాది రూపాయల డబ్బులు ముట్టడంతోనే గనులను కేటాయించిందన్నారు. ఈ గనులను రద్దుచేసి సింగరేణికి కేటాయించేలా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కృషి చేయాలన్నారు. గతంలో సింగరేణి 15 బొగ్గు బ్లాక్‌ల పర్మిషన్లకు దరఖాస్తు చేసుకుంటే వాటిని సింగరేణికి కేటాయించకుండా వేలంలో పెట్టడం సింగరేణి మునగడకు విఘాతం కలిగించేలా ఉందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని యూనియన్లను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. అవసరమైతే నిరధిక సమ్మె కూడా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్లా బాలాజీ, నాయకులు అంబాల శ్రీనివాస్, జీవన్, సిరికొండ శ్రీనివాస్, పెరిక సదానందం, చంద్రోశఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి



శిరీషరెడ్డిని సన్మానిస్తున్న లీగల్ సెల్ సిబ్బంది

శ్రీరాంపూర్: కోర్టుల్లో సింగరేణిపై వేసిన కేసుల సత్వర పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని సింగరేణి లీగల్ సెల్ శ్రీరాంపూర్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ శిరీషరెడ్డి పేర్కొన్నారు. తాజాగా డీజీఎంగా పదోన్నతి పొందిన ఆమెను శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని లా డిపార్టుమెంట్ చాంబర్‌లో సోమవారం అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ముున్ముందు కూడా ఆమె మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కంపెనీకి ఎల్లవేళలా సేవ చేస్తూ న్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏరియా సీనియర్ లా ఆఫీసర్ ప్రబంధిత, లీగల్ సెల్ ఉద్యోగులు శ్యామల, రమ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి కార్మిక సంఘాల నాయకులను కలిసి వినతి పత్రం అందజేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్‌లను కలిసి తమ సమస్యలను విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రారావు, ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసీరెడ్డి, కంపెనీ మాజీ డైరెక్టర్ దత్తాత్రేయులు ఉన్నారు.

ట్రెజరీలోనే చెక్కులు

- ఆర్థిక సంవత్సరం ముగిసినా పాస్‌కాని వైనం
- ఆందోళనలో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు
- పంచాయతీల్లో ఖర్చు చేసిన బిల్లులకు జాప్యం



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ పనులకు సంబంధించి నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగక ట్రెజరీలో చెక్కులు మూలుగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరిలో చెక్కులు క్లియర్ అవుతాయని ఆశించిన ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు నిరాశే మిగిలింది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ట్రెజరీలో జమ చేసిన చెక్కులతోపాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే నెల చెక్కులు మొత్తంగా మంచిర్యాల జిల్లాలో దాదాపు 1,200 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఇంజినీరింగ్ విభాగం, పే అండ్ అకౌంట్స్(పీఏఓ)కు సంబంధించి రూ.25 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులను అప్పులు చేసి పూర్తి చేయగా.. బిల్లులు సకాలంలో రాక ఆందోళన చెందుతున్నారు. చెక్కుల కాలపరిమితి ముగిసిందని రిజెక్ట్ చేస్తుండడంతో తిరిగి చెక్కులు ట్రెజరీలో అందజేయడం తలకు మించిన భారంగా మారింది. మంచిర్యాల జిల్లాలోని 311 గ్రామ పంచాయతీలకు సంబంధించి దాదాపు 10 నెలలుగా చెక్కులు పాస్ కావడం లేదు. ఫిబ్రవరి ఒకటితో పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. అప్పటి వరకు పదవుల్లో కొనసాగిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పంచాయతీ నిధులతో పనులు చేయించారు. బిల్లుల కోసం ఎంబీ చేయించి చెక్కులు ట్రెజరీ పంపించినా ఖజానాలో నిధుల కొరతతో చెల్లింపులు జరగడం లేదు. అప్పులు తెచ్చి మరీ పనులు పూర్తి చేయగా బిల్లులు రాక వడ్డీలు పెరిగిపోతున్నాయని లబోదిబోమంటున్నారు.

రిజెక్ట్ అయితే..

పంచాయతీల చెల్లింపుల కోసం ఇచ్చిన చెక్కులు ట్రెజరీలో మూలుగుతున్న నేపథ్యంలో వాటి కాలపరిమితి ముగిసి రిజెక్ట్ అవుతాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా చెల్లింపులు జరిగితే ఏ ఇబ్బందులు ఉండవు. కానీ మార్చి 31 దాటిపోయినా ఇప్పటికే ఒక్క చెక్కు పాస్ కావడం లేదు. ఒకవేళ చెక్కుల కాలపరిమితి ముగిసిందని రిజెక్ట్ అయితే తిరిగి రాయించడం పెద్ద సమస్యగా మారుతోంది. చెక్కుల కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం వాటిని అనుమతిస్తే అలాగే వాడుకునే అవకాశం ఉంటుందని కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అవసరమైతే చెక్కులను రిజెక్ట్ చేయకుండా కొంతకాలం హోల్డ్‌లో ఉంచాలని అంటున్నారు.

అందరూ ఏకమై కుక్కను చంపేశారు



గ్రామస్తుల చేతిలో హతమైన కుక్క

వేమనపల్లి: రెండు రోజులుగా వేమనపల్లితో పాటు దస్నాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో స్వైర విహారం చేసి ఎనిమిది మందిపై దాడికి పాల్పడిన వీధి కుక్కను గ్రామస్తులంతా ఏకమై చంపేశారు. ఆదివారం వేమనపల్లిలో దాడి చేసిన కుక్క దస్నాపూర్, కొత్తపల్లి మీదుగా కొత్త కాలనీకి వెళ్లింది. అక్కడే రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మర్మల వెంకటిపై దాడి చేసింది. అదే నాందేవ్‌కు చెందిన ఎద్దును తీవ్రంగా గాయపర్చింది. గ్రామస్తులు అరుస్తూ కేకలు వేయడంతో దస్నాపూర్ కొత్తగుడిసెల వైపు పరుగులు తీసింది. రోడ్డుపై ఉన్న యువకులపై దాడికి యత్నించగా గ్రామస్తులు సమయస్ఫూర్తితో వ్యవహరించి కుక్కను అడ్డుకున్నారు. కర్రలతో దాడి చేసి చంపేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కౌటాల: మండలంలోని గురుడుపేట–బోదంపల్లి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ గ్రామానికి చెందిన నిరుపన్ బిశ్వాస్ (35) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిరుపన్ బిశ్వాస్ కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం నుంచి స్వగ్రామం రవీంద్రనగర్‌కు బైక్ పై వెళ్తుండగా గురుడుపేట సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి నిర్మల్ బిశ్వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుప్పిని హతమార్చిన ముగ్గురి రిమాండ్



నిందితులను చూపిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వేంపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఈనెల 13న దుప్పిని హతమార్చిన ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో రమాదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌బాబు తెలిపారు. ఈ నెల 13న వేంపల్లి అటవీ ప్రాంతంలో కొందరు దుప్పిని హతమార్చినట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపించామన్నారు. నిందితులు సిర్పూర్ (టి) మండలంలోని మన్నెగూడ గ్రామానికి చెందిన నాయని అశోక్, రాలే అంజి, టేకం తిరుపతిని అరెస్టు చేసి సోమవారం సిర్పూర్ (టి) కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం మనోహర్

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ పోస్టుల భర్తీ కోసం మంగళవారం నుంచి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. పరీక్షలు నిర్వహించే ప్రగతి మైదానంను సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ పోస్టుల భర్తీలో భాగంగా ఇక్కడ డ్రైవింగ్ టెస్టును నిర్వహిస్తున్నారు. దీనికి కావాల్సిన ఏర్పాట్లు సరిగ్గా ఉండాలన్నారు. అభ్యర్థులు ఎండకు ఇబ్బంది పడకుండా టెంట్లు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, వైద్య సిబ్బందిని, అంబులెన్సును అందుబాటులో ఏర్పాటు చేయాలని జీఎం సూచించారు. పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం వర్క్‌షాప్ రవీందర్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో 18, 19న ఈపీ ఆపరేటర్స్ ట్రైనీల ఎంపిక కోసం యాజమాన్యం పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఏరియా జీఎం మనోహర్ సోమవారం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఆపరేటర్స్ ట్రైనీల ఎంపిక కోసం 187మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారని, నిష్పక్షపాతంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని తెలిపారు. ఆయన వెంట ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్‌వో రవి, అధికారులు, యూనియన్‌ల ప్రతినిధులు ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

దహెగాం: మండలంలోని హత్తినిలో సోమవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి మనోజ్‌రావ్ ట్రాక్టర్‌లో నకిలీ విత్తనాలు తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు 1.24 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వాటి విలువ రూ.3.10 లక్షలు ఉంటుందన్నారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజులనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లపల్లి మనోజ్‌రావు, ట్రాక్టర్ డ్రైవర్ సింహాద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గొల్లపేట్ కాలనీకి చెందిన ప్రమోద్ (31) వృత్తి రీత్యా ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి బయట ఉండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హై టెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.